సాక్షి కర్నూలు

బుధవారం ; 26 ; మార్చి ; 2025



ఆకట్టుకున్న తోలు బొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల నేపథ్యంలో మంగళవారం కడపకు చెందిన వైవీ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన తోలు బొమ్మలాట భక్తులను ఆకట్టుకుంది.



శ్రీగిరి భక్తజనసంద్రం

శ్రీశైల క్షేత్రం కన్నడ భక్తులతో జనసంద్రంగా మారింది. వృద్ధులు, మహిళలు, చంటిపిల్లల తల్లులు సైతం పాదయాత్రగా మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు.

IIలో▸



మద్దిలేటయ్య హుండీ లెక్కింపు

మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి హుండీ లెక్కింపు ద్వారా రూ. 39.66 లక్షలు, 47 గ్రాముల బంగారు, 1.300 కిలోల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:55
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 4:53
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:55
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:50
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:53

హదీస్ వెలుగు:
మంచి పనులు చేస్తున్నప్పుడు ఒకరికి చూపాల్సిన అవసరం లేదు. చెడు చేస్తున్నప్పుడు ఎవరూ చూడటం లేదు అని కాదు.. సృష్టికర్త అల్లాహ్ అన్నీ చూస్తున్నారు. - పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

28 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



కైరుప్పలలో వెలసిన వీరభద్ర స్వామి

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి రాంప్రసాద్, సర్పంచ్ తిమ్మక్క, గ్రామ పెద్దలు తెలిపారు. ఈనెల 28 ధ్వజారోహణ సందర్భంగా ఆలయంలో వీరభద్రస్వామి, కాళికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. 29న పూజా కార్యక్రమం, 30న ఉగాది, 31న పెద్దనుగ్గులాట, ఏప్రిల్ 1వ తేదీన స్వామి వారికి ప్రత్యేక పూజలు, 2న సాధారణ పూజలు, 3న రథోత్సవం, 4న ప్రత్యేక పూజలు, 5న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఏప్రిల్ 1 వరకు ఎండుమిర్చి, వాము క్రయవిక్రయాలు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1 వరకు ఎండుమిర్చి, వాము క్రయవిక్రయాలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అకౌంట్స్‌ను క్లోజ్ చేసుకోవాల్సి ఉందని.. వాము, ఎండుమిర్చి క్రయవిక్రయాలు చేపట్టలేమని వ్యాపారస్తుల అసోషియేషన్ చెప్పినందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని, కమీషన్ ఏజెంట్లు కూడా ఆయా సరుకులను తెప్పించరాదని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

డ్వామాలో బదిలీల ప్రక్రియ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. వివిధ కేటగిరీల్లో 119 మందిని బదిలీ చూస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు.

- ఆలూరు క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న పద్మావతిని కర్నూలు క్లస్టర్‌కు, కర్నూలు క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న లక్ష్మన్నను పత్తికొండ క్లస్టర్‌కు, పత్తికొండ క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న పక్కీరప్పను ఆలూరు క్లస్టర్ ఏపీడీగా బదిలీ చేశారు.
- ఏపీవోల్లో ఎం.తిమ్మారెడ్డిని మంత్రాలయం నుంచి హొళగొంద మండలానికి, జి.మద్దేశ్వరమ్మను కల్లూరు నుంచి ఓర్వకల్‌కు, కే.వెంకటేశ్వర్లును పత్తికొండ నుంచి తుగ్గలికి, ఎం.భక్తవత్సలంను హొళగొంద నుంచి మంత్రాలయానికి, కుమార్‌సాయినాథ్‌ను ఓర్వకల్ నుంచి పత్తికొండకు, బి.మాధవశంకర్‌ను కోసిగి నుంచి ఆదోనికి బదిలీ చేశారు.
- ఐదుగురు జేఈలు, ఇద్దరు ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు కూడా బదిలీ అయ్యారు.

ఆర్‌యూ, కేయూల ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ ఉమా

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ వి.ఉమా నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ జీవో ఆర్‌టీ నెం.56, 2025 జారీ చేసింది. రాయలసీమ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీగా, క్లస్టర్ యూనివర్సిటీకి ఇన్‌చార్జ్ వీసీగా ఉన్న ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు వ్యక్తిగత పనుల నిమిత్తం విదేశీ పర్యటనకు వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి కోరడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆయన 16 రోజుల పర్యటన ముగించుకొని వచ్చే వరకు తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ వి.ఉమాను రెండు వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరించనున్నారు.



పోలకల్ పీహెచ్‌సీలో వైద్యాధికారి ఉదయం 11 గంటలైనా రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

పల్లె వైద్యం.. దైవాధీనం!

పీహెచ్‌సీల్లో తూతూమంత్రంగా వైద్యసేవలు

- మొక్కుబడిగా మందులు సరఫరా
- సకాలంలో రాని వైద్యులు, సిబ్బంది
- ప్రసవాలు ఎక్కువ శాతం సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లోనే..
- రాత్రి వేళల్లో రోగులకు తప్పని ఇక్కట్లు

రోగమొస్తే వైద్యం చేయించుకోవడానికి గ్రామీణులకు అందుబాటులో ఉన్నది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే. ఇక్కడ కూడా సకాలంలో వైద్యులు, సిబ్బంది లేకపోవపోతే వారు కాళ్లీడ్చుకుంటూ పట్టణాలకు పోవాల్సిందే. అప్పటి వరకు వారి ఆరోగ్య పరిస్థితి ఎలాగుంటుందో చెప్పలేని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. చాలా పీహెచ్‌సీల్లో వైద్యులు సకాలంలో రాకపోవడంతో పల్లె ప్రజలకు వైద్యం అందడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న (సోమవారం) జిల్లాలోని పీహెచ్‌సీలను సాక్షి బృందం సందర్శించి పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.



మొలగవల్లి పీహెచ్‌సీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లాలో 35 పాత పీహెచ్‌సీలు, 12 కొత్త పీహెచ్‌సీలు ఉన్నాయి. పాత పీహెచ్‌సీ భవనాల్లోనే కొత్త పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి వారికి కేటాయించిన పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది చొప్పున వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరు వేయాల్సి ఉంది. అయినా కూడా కొంత మంది విధులకు ఆలస్యంగా రావడం, త్వరగా వెళ్లడం చేస్తున్నారు. కొందరు మధ్యలో వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చి హాజరు వేసి వెళ్తున్నారు. జిల్లాలో దాదాపుగా అన్ని పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేయాల్సి ఉండగా 10 శాతం పీహెచ్‌సీలు కూడా పనిచేయడం లేదు. పీహెచ్‌సీల్లో నైట్‌వాచ్‌మెన్ లేరని సాకుచూపుతూ ఎవ్వరూ రాత్రివేళల్లో విధులకు హాజరుకావడం లేదు. దీంతో ప్రసవాలకు, అత్యవసర వైద్యానికి సమీపంలోని సీహెచ్‌సీలకు, ఏరియా ఆసుపత్రులకు, కర్నూలు జీజీహెచ్‌ను ఆశ్రయిస్తున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

మందుల కొరత తీవ్రం

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో మందుల కొరత కొన్నాళ్లుగా వేధించింది. గత నెలరోజుల నుంచి మందుల సరఫరా మెరుగుపడటంతో ఇప్పుడిప్పుడే ఆయా పీహెచ్‌సీలకు మందులు చేరుతున్నాయి. అందులోనూ గతంలో ఇచ్చినన్ని రకాల మందులు ఇప్పుడు ఇవ్వడం లేదు. ముఖ్యంగా బీపీ, కొలెస్ట్రాల్, షుగర్‌కు వాడే మందుల్లో కోత విధించారు. ఇన్సులిన్‌ను సైతం నెలరోజులుకు కాకుండా వారానికి ఒకటి చొప్పున ఇచ్చి పంపుతురు. దీనివల్ల వారం వారం రోగులు ఆసుపత్రికి రావాల్సి వస్తోంది. ఇప్పుడు సరఫరా అవుతున్న మాత్రల్లో కూడా నాణ్యత ఉండటం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాత్రలు స్ట్రిప్‌లో నుంచి తీయగానే పొడిగా మారిపోతున్నాయని చెబుతున్నారు. దీంతో మందుల నాణ్యతపై రోగుల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి.



కృష్ణగిరి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న ల్యాబ్ గది

ప్రసవాలు కూడా తక్కువే..

జిల్లాలోని పీహెచ్‌సీల్లో ప్రసవాలు నామమాత్రంగా జరుగుతున్నాయి. నెలలో మూడు నుంచి ఐదులోపు ప్రసవాలు జరుగుతున్న పీహెచ్‌సీలు కూడా జిల్లాలో ఉన్నాయి. గత సంవత్సరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 20,479 ప్రసవాలు జరగ్గా అందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,671(22.80శాతం), ప్రైవేటు ఆసుపత్రుల్లో 15,808(77.19శాతం) ప్రసవాలు జరిగాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ఉన్నందున ప్రభుత్వ ఆసుపత్రులకు రావడానికి గర్భిణిలు ఇష్టపడటం లేదని వైద్యులు చెబుతున్నారు.

- కర్నూలుకు కూతవేటు దూరంలో ఉన్న గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు, ఒక సూపర్‌వైజర్, ఒక ఎంపీహెచ్‌వో, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్ ఉండగా ఇక్కడ ఒక మహిళా వైద్యాధికారి మినహా ఇతరులెవ్వరూ సమయపాలన పాటించడం లేదు. ఒకవేళ వచ్చినా ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేసుకుని కర్నూలుకు వెళ్లి వారి పనులు చూసుకుంటున్నారు. ఆదివారం సెలవు రోజుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అస్సలు తెరవడం లేదు.

రక్తపరీక్షలు కూడా చేయడం లేదు



నేను గత వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నా. కేంద్రంలోని వైద్యులు పరీక్షించి మందులు రాసిచ్చినా తగ్గడం లేదు. వైద్యపరీక్షలు చేయమని కోరితే ఇక్కడ పరీక్షలు చేసేవారు లేరు మరోసారి రమ్మని చెబుతున్నారు. తమ వద్ద డబ్బులు లేకపోవడం వల్లే పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేకపోతున్నామని, ప్రాథమిక ఆరోగ్యానికి వస్తే కనీసం పరీక్షలు చేయడం లేదు. –దావీద్, క్రిష్ణగిరి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలి



మద్దికెర పీహెచ్‌సీలో ఒక స్టాఫ్‌నర్సు తక్కువగా ఉన్నారు. మండల కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయకపోవడంతో బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు కర్నూలుకు వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. –క్రిష్ణ, మద్దికెర

జిల్లాలో ఇదీ పరిస్థితి..

- కృష్ణగిరి మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 15 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇందులో 54 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక డాక్టర్ పోస్టు, ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. రవాణా సౌకర్యం లేకపోవడండతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రోజూ సగటున 20 మంది కంటే ఎక్కువ ఓపీ రావడం లేదు.
- సి.బెళగల్ మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో సోమవారం ఉదయం 9.20 గంటలకు సీహెచ్‌వో ఉమామహేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ శిల్పలు మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు వైద్యాధికారులు 10.40 నుంచి 11.10ల మధ్య పీహెచ్‌సీకి చేరుకున్నారు. పోలకల్ పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అందరూ 9.30 గంటలకు అందుబాటులో ఉండగా పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి సుజాత 11 గంటలకు వరకు రాలేదు. దీంతో వైద్యసేవల కోసం రోగులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.
- మొలగవల్లి పీహెచ్‌సీలో శానిటరి అటెండర్ పోస్టు, రెండు వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 66 కాన్పులు చేశారు. 15 కి.మీల దూరంలో సీహెచ్‌సీ ఉన్నందున ప్రవసం కోసం అక్కడికి వెళ్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.
- ఉలిందకొండ పీహెచ్‌సీలో నైట్‌వాచ్‌మెన్ లేరు, స్కానింగ్ సౌకర్యం లేదు. ప్రసవాల సంఖ్య తక్కువగా నమోదు అవుతోంది. కర్నూలుకు వెల్దుర్తికి మధ్యలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో రోగులు ఎక్కువగా కర్నూలుకు వెళ్తున్నారు.
- తుగ్గలి మండలంలో పగిడిరాయి, తుగ్గలిలో పీహెచ్‌సీలు ఉన్నాయి. పగిడిరాయిలో మాత్రమే ఇద్దరు వైద్యులు ఉన్నారు. తుగ్గలిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ప్రతిమ ఉన్నత చదువుల కోసం పదిరోజుల క్రితం వెళ్లారు. అప్పటి నుంచి పగిడిరాయి వైద్యాధికారిణి హరిత తుగ్గలి ఇన్‌చార్జ్ వైద్యాధికారిణిగా ఉన్నారు. దీంతో ఆమె రెండు పీహెచ్‌సీలు చూసుకోవాల్సి వస్తోంది. ఇక్కడ యూడీసీ కూడా లేరు. తుగ్గలి పీహెచ్‌సీలో 638 మంది గర్భిణిలు రిజిస్టర్ కాగా కేవలం 25 మంది, పగిడిరాయి పీహెచ్‌సీలో 511 మంది గర్భిణిలు రిజిస్టర్ కాగా 35 మంది మాత్రమే ప్రసవించారు.
- ఆస్పరి పీహెచ్‌సీలో ముగ్గురు వైద్యాధికారులు ఉండగా ప్రస్తుతం రఘురామిరెడ్డి సెలవులో ఉన్నారు. మరో వైద్యాధికారి దుర్గాబాయి మండలంలోని యాటకాటు గ్రామానికి క్యాంపునకు వెళ్లారు. డాక్టర్ బాలకృష్ణారెడ్డి ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందించారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



పీహెచ్‌సీల్లో వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలి. రోజుకు మూడుసార్లు హాజరు వేయాలి. రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోతే రోగులు ఫిర్యాదు చేయవచ్చు.
– ఎల్.భాస్కర్, ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్ఓ



అసుపత్రి ఎదుట డివైడర్‌పై అచేతన స్థితిలో సత్యనాగరాజు

చెప్పుకోలేక.. కన్నీళ్లు దిగమింగలేక!

కన్నబిడ్డలు ఉన్నారో లేరో తెలియదు.. భారమై వదిలించుకున్నారో, తానే వాళ్లకు భారమనుకున్నాడో చెప్పుకోలేడు.. పరువు బజారున పడుతుందనుకున్నాడో.. ఎక్కడో ఒకచోట ఈ ప్రాణం ఇలా వదిలేద్దామనుకున్నాడో.. ముదిమి వయస్సులో మండుటెండలో జీవశ్ఛవమయ్యాడు. కాళ్లు కదపలేడు, కన్నీటిని ఆపుకోలేడు.. ఊరు పేరు తప్ప వివరాలకు ఉబికి వచ్చే కన్నీళ్లే సమాధానం. ఈ 70 ఏళ్ల శరీరం నగరం నడిబొడ్డున, ప్రభుత్వాసుపత్రి ఎదుట మంగళవారం మధ్యాహ్నం దిక్కులు చూస్తూ.. దేవుడిపైనే భారం వేసింది. రోడ్డు మధ్యనున్న పచ్చని డివైడర్‌లో ఈ 'పెద్దరికం' మోడుబారి పడుకుంది. – కర్నూలు(హాస్పిటల్)

(ఇతని పేరు సత్యనాగరాజు. ఊరు విజయవాడ. ఈ వివరాలు తప్ప మరో మాట మాట్లాడని ఈయన దయనీయ స్థితికి కర్నూలు నగరం కన్నీరు పెట్టింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు చలించిపోయారు. రాత్రి 8 గంటల సమయంలో 108ను పంపి ఆయనను క్యాజువాలిటీలో అడ్మిట్ చేయించారు.)

ఈకేవైసీ చేయిస్తేనే రేషన్

- ఈనెల 31వ తేదీ వరకు గడువు
- రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడు వేలిముద్రలు వేయాల్సిందే
- జిల్లాలో ఈకేవైసీ పెండింగ్ కార్డు సభ్యుల సంఖ్య 2,78,177

కర్నూలు(సెంట్రల్): రేషన్ కార్డులోని సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోకపోతే కార్డులోని వారి తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టంది. కార్డులోని ప్రతి సభ్యుడు సమీపంలోని రేషన్ డీలర్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది లాగిన్లలో ఆధార్ కార్డు చూపించి వేలి ముద్రలు లేదా ఐరిస్ ఇవ్వాలి. లేదంటే మార్చి 31వ తేదీ తరువాత వారి పేర్లను కార్డు నుంచి తొలగిస్తారు. కర్నూలు జిల్లాలో 6,34,631 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో కుటుంబ సభ్యులంతా సభ్యులుగా ఉంటారు. అలా 6,34,631 కార్డులలో 21,92,047 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా ఈకేవైసీ చేయించుకోవాలి. గతంలోనే దాదాపు 80 శాతం మంది చేయించుకున్నారు. మిగిలిన 20 శాతం మంది సభ్యుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వారి నుంచి వేలిముద్రలు, కంటి ఐరిస్‌తో ఈకేవైసీని పూర్తి చేయాలని ఆదేశించింది. జిల్లాలో 19,13,870 మంది రేషన్‌కార్డు సభ్యుల ఈకేవైసీ పూర్తయింది. మిగిలిన 2,78,177 మంది సభ్యులు మార్చి31వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది.



స్పందించని డీలర్లు.. పనిచేయని మొబైల్ అప్లికేషన్

పెండింగ్ ఈకేవైసీని డీలర్లు, వీఆర్వోలు, సచివాలయ కార్యాదర్శుల దగ్గర చేయించుకోవాలి. ఇందుకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్ జాబితాను మండలాలు, సచివాలయాల వారీగా అందుబాటులో ఉంచారు. అయితే డీలర్లు ఈకేవైసీ వేయించడానికి స్పందించడం లేదు. వీఆర్వోలు పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదు. సచివాలయ సిబ్బంది మొబైల్ అప్లికేషన్‌లో సర్వనఖ బిజీ వస్తోంది. ఈక్రమంలో నిర్దేశించిన సమయం దగ్గర పడుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈకేవైసీ కోసం గడువును పొడిగించాలని కోరుతున్నారు.

ఈనెలాఖరులోపు చేయించుకోవాలి



జిల్లాలో మొత్తం 21,92,047 మంది సభ్యుల్లో ఇంకా 2,78,177 మంది ఈకేవైసీ చేయించుకోవాలి. వీరంతా ఈకేవైసీని మార్చి31వ తేదీ లోపు చేయించుకోవాలి. లేదంటే ఎవరి ఈకేవైసీ పూర్తి కాలేదో ఆ సభ్యుడి పేరును రేషన్ కార్డును నుంచి తొలగించి, రేషన్ సరఫరా నిలిపేస్తారు.
– ఎం.రాజారఘువీర్, డీఎస్ఓ

గడువును పొడిగించాలి



రేషన్ కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీ కోసం గడువును పొడిగించాలి. ఈ అంశంపై అధికారులు విస్తృత ప్రచారం కల్పించడం లేదు. దీంతో చాలా మందికి ఈ విషయంపై అవగాహన లేదు. మరో నెలపాటు గడువును పొడిగించాలి. లేదంటే చాలా మంది ఇబ్బంది పడతారు.
– చంద్రశేఖర్, సీపీఐ నాయకులు, కర్నూలు

సంక్షేమ హాస్టళ్లలో రాత్రి బసకు శ్రీకారం

- కర్నూలు కళాశాల బాలికల వసతిగృహంలో జేడీ రంగలక్ష్మిదేవి బస

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తప్పక హాస్టళ్లలో బస చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మిదేవి ఆదేశించారు. మంగళవారం రాత్రి నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వార్డెన్లు రాత్రి సమయాల్లో హాస్టళ్లలోనే నిద్రించి విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అలాగే ఆయా హాస్టళ్లలో స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. బాలల సంరక్షణ చట్టాలు, పోక్సో యాక్ట్, చైల్డ్ హెల్ప్‌లైన్ తదితర నెంబర్లను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. జేడీతో పాటు హెచ్‌డబ్ల్యూఓ పెన్నమ్మ కర్నూలు కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులతో కలసి నిద్రించారు. అలాగే కళాశాల బాలుర వసతి గృహంలో కర్నూలు సహాయ సంక్షేమాధికారి బి.మద్దిలేటి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటరెడ్డి బస చేశారు.



కళాశాల విద్యార్థినులతో కలసి నిద్రిస్తున్న జేడీ రంగలక్ష్మిదేవి

పశువుల దాహార్తి తీర్చేందుకు తొట్లు ఏర్పాటు

- డ్వామా పీడీ వెంకటరమణయ్య



కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నీటి తొట్లు ఎక్కడెక్కడ అవసరమనే దానిపై వివరాలు ఇవ్వాలని పశుసంర్థక శాఖ అధికారులను అడిగామని, వారు నివేదిక మేరకు 300 తొట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఏప్రిల్ మూడో వారంలో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మే నెల చివరిలోపు జిల్లాలో 8,500 ఫాంపాండ్స్ నిర్మించనున్నామని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పంట కాల్వలు, ఫీడర్ చానళ్లల్లో పేరుకపోయిన పూడికను తొలగిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఉపాధి పనులకు లేబర్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, డిమాండ్‌కు అనుగుణంగా చెరువులు, కుంటల్లో కూడా పూడిక తీసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా ఎస్ఎస్ ట్యాంకులను నింపండి

- జిల్లాపరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు (అర్బన్): జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులకు ఏప్రిల్ 14వ తేదీ వరకు నీటి సరఫరా జరుగుతున్నందున ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఎస్ఎస్ ట్యాంకులన్నిటినీ నింపుకోవాలని జిల్లాపరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక జెడ్పీ మినీ సమావేశ భవనంలో తాగునీటి ఎద్దడి, జెడ్పీ నిధులతో చేపట్టిన వివిధ పనుల పురోగతిపై ఆయన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా పథకాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో నీటి వృథాను అరికట్టేందుకు పైప్‌లైన్ల లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లాపరిషత్ నిధుల ద్వారా మంజూరైన ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు మంజూరు చేసిన ఈఎంఎఫ్ పనులను వెంటనే చేపట్టి జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పనులకు సంబంధించి ఐసీడీఎస్ అధికారులను సమన్వయం చేసుకుని పంచాయతీరాజ్ ఇంజనీర్లు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు, నంద్యాల ఎస్ఈలు బి.నాగేశ్వరరావు, సీహెచ్ మనోహర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

క్లుప్తంగా

పల్లె పుష్కరిణిలుగా చెరువుల అభివృద్ధి

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను 'పల్లె పుష్కరిణిలు'గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 31 పల్లె పుష్కరిణిలను గుర్తించారు. ఒక ఎకరా నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులను.. కనీసం వెయ్యి జనాభా కలిగిన గ్రామాల్లో మాత్రమే ఈ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు చెరువులను మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయనున్నారు. గ్రామ పంచాయతీలు, దేవాలయ కమిటీలు, గ్రామ ప్రజల సమ్మతితో మాత్రమే కోనేర్లను అభివృద్ధి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది.

జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారుల సత్తా



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో డీవీఈఓ, ఆర్ఐఓలు

కర్నూలు (టౌన్): జిల్లాకు చెందిన 51 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారి పరమేశ్వర రెడ్డి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన జిల్లా క్రీడాకారులకు మంగళవారం ఆర్ఐఓ గురువయ్యశెట్టితో కలిసి ఆయన పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, లాలప్ప, అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

కొత్తపల్లి: తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి చెందాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.జాన్సన్, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేజీ నాయక్ గిరిజనులకు సూచించారు. మంగళవారం మండలంలోని పాలెంచెరువు గూడెంలో గిరిజనులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నేషనల్ హానీ బీ బోర్డ్ సంయుక్తంగా పాలెంచెరువు గ్రామానికి చెందిన 25 మంది గిరిజన రైతులకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగలను పెంచి, తేనెను తయారు చేసుకునే విధానంపై ఏడు రోజుల శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సర్పంచు మశమ్మ, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, శాస్త్రవేత్తలు కె.అశోక్ కుమార్, కె.మోహన్, విష్ణువర్ధన్, ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.



నల్లమల అడవుల్లో పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తులు



కాలినడక పాదయాత్రగా తరలివస్తూ..



కదిలి వస్తున్న మల్లన్న దండు..



పాతాళగంగలో పుణ్యస్నానాలు

శ్రీగిరి క్షేత్రం.. భక్తజనసంద్రం

శ్రీశైల క్షేత్రం మల్లన్న నామస్మరణతో మారుమ్రోగుతోంది. ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రలకు నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులతో శ్రీగిరి క్షేత్రం జనసంద్రంగా మారింది. పాదయాత్ర భక్తులు పల్లకీల ముందు తప్పెట దరువులకు కుంకమ చల్లుకుంటూ, చిందులు వేస్తూ మల్లన్నను కీర్తిస్తున్నారు. కన్నడ భక్తుల నృత్యాలతో శ్రీగిరి క్షేత్రం మరింత ఉత్సవ శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పూజావేళల్లో మార్పులు చేసి వేకువజాము నుంచే స్వామిఅమ్మవార్ల దర్శనానికి అనుమతిస్తున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనక్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. కన్నడ భక్తులకు నాలుగు విడతలుగా మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. మల్లన్న స్పర్శదర్శనం నేటితో ముగియడంతో వృద్ధులు, మహిళలు, చంటిపిల్లల తల్లులు సైతం పాదయాత్రగా మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. కొందరు కాళ్లకు కర్రలు కట్టుకుని, మరికొందరు పల్లకీ మోసుకుంటూ పాదయాత్రగా తరలివస్తున్నారు. ఇప్పటికే ఆలయ పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. – శ్రీశైలంటెంపుల్



పల్లకీ(కంబి) మోసుకుంటూ వస్తున్న కన్నడ భక్తులు

మల్లన్న సేవలో కర్ణాటక రాష్ట్ర గవర్నర్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన కర్ణాటక గవర్నర్‌కు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో గవర్నర్‌కు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.



కర్ణాటక గవర్నర్‌కు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈఓ

'కూటమి' తంత్రం.. అందని యంత్రం

- టీడీపీ నేతలు చెప్పిన వారికే వ్యవసాయ యంత్ర పరికరాలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం ఉన్న పథకాలను నీరుగారుస్తోంది. గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా యాంత్రీకరణతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం సిఫారస్సులకు లోబడే యంత్రీకరణ అమలు చేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. టీడీపీకి చెందిన వారికే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని ప్రజలే చెబుతున్నారు.

టీడీపీ వారికే యంత్రాలు

వ్యక్తిగత వ్యవసాయ యంత్రాల పంపిణీలో టీడీపీ నేతల సిఫార్సులకే వ్యవసాయ శాఖ అధికారులు పెద్దపీట వేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో వ్యవసాయ శాఖ.. రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. కేంద్రప్రభుత్వ నిధులు 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 40 శాతం నిధులు



రైతులకు ఇవ్వాల్సిన రోటావేటర్

అందిస్తోంది. కర్నూలు జిల్లాలో రూ.రూ.2.87 కోట్లతో 1,660 యంత్రపరికరాలు, నంద్యాల జిల్లాలో రూ.2.85 కోట్లతో 1,635 యంత్రపరికరాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. కర్నూలు జిల్లాకు బ్యాటరీ స్ప్రేయర్లు 250, డైవాన్ స్ప్రేయర్లు 600, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 7, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్ 740, రోటావేటర్లు 28, పవర్ వీడర్లు 17, బ్రస్‌కట్టర్లు 13, పవర్ టిల్లర్లు 5 ప్రకారం పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

ఒక్కటి కూడా ఇవ్వకుండా...

నంద్యాల జిల్లాలో డైవాన్ స్ప్రేయర్లు 575 కేటాయించగా.. మిగిలినవన్నీ.. కర్నూలు జిల్లాతో సమానంగా కేటాయించారు. ఒక్కో మండలంలో 30 నుంచి 50 గ్రామాలు ఉంటాయి. బ్యాటరీ స్ప్రేయర్లు, డైవాన్ స్ప్రేయర్లు గ్రామానికి కనీసం ఒక్కటి కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. రోటావేటర్లు మండలానికి ఒక్కటి ప్రకారమే కేటాయించారు. పవర్ టిల్లర్లు, బ్రస్‌కట్టర్లు, పవర్ వీడర్లు అతి తక్కువగా ఉండటంతో టీడీపీ నేతల ప్రాబల్యం ఉన్న మండలాలకే కేటాయించారు. వ్యక్తిగత యంత్ర పరికరాలు సరఫరా చేసేందుకు దాదాపు 50 కంపెనీలను గుర్తించింది. బ్యాటరీ స్ప్రేయర్లకు రూ.1000, డైవాన్ స్ప్రేయర్లకు రూ.8000 నుంచి 10 వేల వరకు, ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్‌కు కంపెనీని బట్టి గరిష్టంగా రూ,35 వేల వరకు, రోటావేటర్‌కు రూ.46 వేలు, పవర్ వీడర్లకు రూ.30 వేల నుంచి 40 వేల వరకు, బ్రస్‌కట్టర్లకు రూ.25 వేల నుంచి రూ.44 వేలు, పవర్ టిల్లరుకు లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు సబ్సిడీ ఉంటుంది. ఇంప్లిమెంట్స్ అతి తక్కువగా ఉండటంతో కూటమి నేతల సిఫార్సుల పర్వం జోరుగా సాగుతోంది. వారు ఎవ్వరికి చెబితే వారికే ఇస్తామని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



చిరునవ్వు చిందిస్తూ..

'బోసి నవ్వుల' బంధం!


ఆ మహాత్ముని బోసినవ్వు ఆ చిన్నారిని ఆకట్టుకుంది. విగ్రహంలోని అమాయకత్వంతో ఆ పసిహృదయం మాట కలిపింది. మచ్చలేని మహనీయుడికి అంటుకున్న మరకలను ఆ 'తెల్లని' మనసు తుడిచేసింది. ఆ చిక్కని చిరునవ్వుని తన చిట్టి చేతులతో తడమటం తాతా మనవడి బంధాన్ని గుర్తుచేసింది.

(మంగళవారం ఉదయం కర్నూలు పెద్దాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో మహాత్మాగాంధీ విగ్రహంతో ఓ బాలుడి ఆత్మీయత అక్కడున్న వారందరిలో నవ్వులు పూయించింది.)

– ఫొటోలు: డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్



మాట కలుపుతూ..



మరక చెరిపేస్తూ..

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

కర్నూలు(సెంట్రల్): గ్రేడు–1 వీఆర్వోలుగా పదోన్నతి కోసం రూపొందించిన 161 మంది గ్రేడు–2 వీఆర్వోల పదోన్నతి జాబితాపై అభ్యంతరాలు తెలపాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ జాబితాను కలెక్టరేట్‌తో పాటు ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఎవరికైనా సంబంధిత వీఆర్వోల సీనియారిటీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు పని దినాల్లో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు.

అర్చకుల మధ్య ఘర్షణ

కొత్తపల్లి: మండల పరిధిలోని కొలనుభారతి దేవి క్షేత్రం అర్చకుల మధ్య ఘర్షణ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివపురం గ్రామానికి చెందిన శ్రీనివాస శర్మ కొలనుభారతి క్షేత్రంలో వంశపారంపర్య అర్చకుడిగా, అదే గ్రామానికి చెందిన చక్రపాణి శర్మ దినసరి వేతన అర్చకుడిగా పనిచేస్తున్నారు. వీరిరువురి మధ్య సోమవారం ఆలయ ఆవరణలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సమస్య పరిష్కరించుకుందామని చక్రపాణి శర్మ తన ఇంటికి పిలింపుచుకుని కర్రలతో దాడి చేయగా వీపు, భుజం, చేతులపై కందిన గాయాలయ్యాయని ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ మంగళవారం విలేకరుల ఎదుట వాపోయారు. ఇదే విషయాన్ని ఈఓ రామలింగారెడ్డి, పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లానని అన్నారు. తనపై దాడి చేసిన చక్రపాణి శర్మపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. కాగా ఈఓను సాక్షి వివరణ కోరగా దాడి జరిగినట్లు తెలిసిందని, బుధవారం ఆలయంలో అందరి సమక్షంలో విచారణ చేపడతామని చెప్పారు.

విద్య, ఉపాధితోనే గ్రామాల అభివృద్ధి



ముగింపు సదస్సులో పాల్గొన్న రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

కర్నూలు సిటీ: విద్య, ఉపాధి అవకాశాలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఎకనమిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు – సాధకబాధకాలు అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. చివరి రోజు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే విద్య అవకాశాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యాలు అభివృద్ధి కావాలని, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ ప్రసాద్‌రెడ్డి, సీఐ నాగశేఖర్, ఆర్థిక శాఖ అధ్యాపకురాలు డాక్టర్ సవితదేవి, సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఎల్లా కృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు అధిక డిమాండ్

- జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళీకృష్ణ



ప్రకృతి వ్యవసాయ పద్ధతి విత్తన గుళికలను పొలంలో చల్లుతున్న అధికారులు

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని పాలెంచెరువు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జి.నరేంద్రారెడ్డి, ఏడీఏ ఆంజనేయులు, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. పంటమార్పిడి పద్ధతిని అవలంబించాలన్నారు. రైతు సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని మినుములు, శనగలను మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు. నీటి వసతి ఉన్న రైతులు వేసవిలో పప్పు జాతి పంటలను సాగుచేసుకోవాలని, తద్వారా నేలకోత తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పొలాలను పరిశీలించా రు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో విత్తన గుళికల త యారీ విధానం, పొలంలో వెదజల్లే తీరును రైతులకు చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మశమ్మ, ఏఓ మహేష్, ఉద్యాన శాఖ అధికారి చందన పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న పీడీ ఉమాదేవి

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి సాగులో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉందని.. రైతులు అధిక దిగుబడి, నాణ్యతను పెంపొందించుకోవడంతో పాటు నిల్వ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. మంగళవారం ఉద్యానశాఖ ఉల్లి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు కర్నూలులోని ఉద్యానభవన్‌లో శిక్షణ, చర్చా కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా ఉద్యాన అధికారి పి.రామంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఏటా 5.40 లక్షల టన్నుల ఉల్లి ఉత్పత్తి అవుతోందన్నారు. అవగాహనతో సాగు చేపడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని, నాణ్యత బాగుంటే గిట్టుబాటు ధరలు లభిస్తాయన్నారు.

- జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు మాట్లాడుతూ ఉల్లి సాగులో ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి మాట్లాడుతూ పండించిన పంటను బాటీ ఆరబెట్టి గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తీసుకొస్తే గిటుబాటు ధర లభించే అవకాశం ఉంటుందన్నారు.
- ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి మాట్లాడుతూ సూక్ష్మ సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగు చేసుకోవచ్చని, ఎరువుల వినియోగం కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు.
- మహానంది వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఠాగూర్‌నాయక్ మాట్లాడుతూ ఉల్లి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు.

ఎస్‌డీఆర్‌ఎఫ్ సేవలకు కమాండెంట్ అభినందన



ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సత్కరించిన కమాండెంట్ దీపిక పాటిల్

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలను కమాండెంట్ దీపిక పాటిల్ అభినందించి సత్కరించారు. ఈనెల 16న విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన వెంకటరత్నం (80) వచ్చి ప్రమాదవశాత్తూ ప్రకాశం బ్యారేజీ సమీపంలో కెనాల్‌లో పడిపోయాడు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న రెండో బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆర్ఎస్ఐ మహేంద్ర నాయక్, శివ, పద్మనాభం, సుదర్శన్ రెడ్డి, హుసేన్, నాగన్న, సత్యనారాయణ తదితరులు పడవ సాయంతో వృద్ధుడిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అందుకు గాను ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలను అభినందిస్తూ మంగళవారం కమాండెంట్ దీపిక పాటిల్ తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ నాగేంద్ర రావు, ఎస్‌డీఆర్‌ఎఫ్ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, ఆర్ఐ సాయికుమార్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ IV
కర్నూలు
బుధవారం ॥ 26-3-2025



స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు.
అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు.
కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది.
సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు.
స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్
తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు.
రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

బ్యూటిప్
మొటిమలు, మచ్చలు పోవాలంటే...



ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.

వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది



కృష్ణకుమారి

కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. "మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి." అన్నారు కృష్ణకుమారి.



మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే





నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్
పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు "నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది" కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్టు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సిలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్టైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్లి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం
పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత తను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.




ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండుసార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్



జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!

విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి.

ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.


క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.

● ఆర్ట్ అండ్ కల్చర్
పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్‌లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...



'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్సిటీ (జీసీయూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!